క్లుప్తంగా

జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా



వేమూరు: నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ జాబ్‌మేళాకు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు రావడం జరిగిందన్నారు. జాబ్‌మేళాకు 78 మంది హాజరు కాగా 22 మందిని వివిధ కంపెనీల వారు ఎంపిక చేసుకోవడం జరిగిందని ఆమె తెలిపారు.

విద్యార్థులకు మొక్కలు పంపిణీ



కొల్లూరు: మొక్కల పెంపకం వల్ల వాతావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చునని, ప్రతి విద్యార్థి తమ వంతుగా మొక్కలను నాటి పెంచడంతోపాటు, సమాజంలో మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలని కొల్లూరు ఈఓ మల్లిఖార్జున అన్నారు. మంగళవారం కొల్లూరు శ్రీసాయి వాసవి విద్యా సంస్థల విద్యార్థులకు మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భట్టిప్రోలు ప్రాంతానికి చెందిన సత్యసాయి బాల వికాస్ సంస్థ సమకూర్చిన మొక్కలను 250 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యా సంస్థల డైరెక్టర్ ఉప్పు శ్రీనివాసరావు, విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు గుమ్మడి రామ్మోహనరావు, హెచ్‌ఎం జి.లావణ్య పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



అమర్తలూరు(వేమూరు): సైబర్ నేరాల నియంత్రణపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజయం సాధించిన బాలికలకు బహుమతులు పంపిణీ చేయడం జరిగిందని చుండూరు సీఐ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. పోలీసు అమర వీరుల వారోత్సవాల సందర్భంగా అమర్తలూరు మండలంలోని పెదపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించామని, ఇందులో పెదపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు పాల్గొనగా, మోర్ల రమ్య ప్రథమ స్థానం, రావుల కీర్తన ద్వితీయ స్థానం, కాకుల వరపు సౌజన్య తృతీయ స్థానం సాధించారన్నారు. వీరికి బహుమతులు అందజేశామన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఆర్.రంగయ్య, ఎస్ఐ అమర్‌వర్ధన్ పాల్గొన్నారు.

యువకుడిపై రౌడీషీటర్ దాడి

తెనాలిరూరల్: యువకుడిపై రౌడీషీటర్ దాడి చేయడమే కాకుండా అతని బైక్‌ను దగ్ధం చేసిన ఘటన సోమవారం రాత్రి పొద్దుపోయాక ఐతానగర్‌లో జరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక నాజరుపేటకు చెందిన కాకుమాను ఇంద్రజిత్ డెకరేషన్ పనులు చేస్తుంటాడు. ఇతని వద్ద పని చేసే యువకుడిని ఐతానగర్‌లో దింపి, సామానును గోడౌన్‌లో పెట్టేందుకు బైక్‌పై వెళ్లాడు. పని చేసే కుర్రాడిని దింపి తిరిగి వస్తుండగా ఐతానగర్ బీఎస్ఏ సెంటరులో తెలిసిన వ్యక్తి కనబడితే పలుకరించి వెళ్లాడు. రౌడీషీటర్ సముద్రాల పవన్ కుమార్ అలియాస్ లడ్డు ఇతని వాహనాన్ని వెంబడించి డాంగే వారి వీధి సమీపంలో అడ్డగించి, తనను పలుకరించకుండా వెళతావా అంటూ ఇంద్రజిత్‌పై రాయి, చేతులు, కాళ్లతో దాడి చేసి గాయపర్చాడు. అంతటితో ఆగకుండా బాధితుడి బైక్‌ను బీఎస్ఏ సెంటరు సమీపంలోకి తీసుకెళ్లి నిప్పంటించాడు. ఇంద్రజిత్ గాయాలతో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. రౌడీషీటర్ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్టు పోలీసులు మంగళవారం తెలిపారు.

క్రీడాస్ఫూర్తి కలిగి ఉండండి



తెనాలిఅర్బన్: క్రీడాస్ఫూర్తి అందరూ కలిగి ఉండాలని టుటౌన్ ఎస్ఐ షరీఫ్ పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం లభిస్తుందని చెప్పారు. అలాగే క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాము, వైస్ ప్రిన్సిపల్ మోహన్‌దాస్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాడు ప్రథమం..

నేడు అధమం

- పాఠశాల ఆవరణలో అధ్వాన పారిశుద్ధ్యం
- పాఠశాల చుట్టూ మురుగు నీటి నిల్వ
- మంచినీటికి విద్యార్థుల అవస్థలు
- రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నెలవు

సమస్యలకు నిలయం గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల





నమ్మండి ఇది పాఠశాలే.. తరగతి గదుల వెనుక డంపింగ్ యార్డును తలపిస్తున్న ఆవరణ (ఇన్‌సెట్) మంచినీరు లేక వాటర్ ప్యాకెట్లు తాగుతున్న విద్యార్థులు

చెరుకుపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో నాడు–నేడు ద్వారా కోట్లాది రూపాయలతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న పాఠశాల నేడు కనీసం మౌలిక వసతులు లేక కునారిల్లుతోంది. బాపట్ల జిల్లాలోనే అత్యధికమంది విద్యార్థులతో, ఉన్నత ప్రమాణాలతో, అత్యధిక ఉత్తీర్ణత శాతంతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన పాఠశాల నేడు సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. అదే చెరుకుపల్లి మండలంలోని గుళ్ళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల.

గత వైభవమే..

పేరుగొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా పాఠశాల గత వైభవాన్ని చెప్పుకుంటూ కాలం వెళ్ల దీస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఊరిలోని మురుగు నీరు పారుదల కాక పాఠశాల పక్కనే ఉన్న కాలువలో నిల్వ చేరి పాఠశాలలో దుర్గంధం రాజ్యమేలుతోంది. దీంతో కొన్నిరోజులుగా విద్యార్థులు సక్రమంగా తరగతి గదుల్లో కూర్చొని, ప్రశాంతంగా పాఠాలు వినలేకపోతున్నారు. అంతేకాకుండా గత నెలరోజులుగా కాలువల్లోని మురుగునీరు పాఠశాల ఆవరణలోకి వచ్చి బయటకు వెళ్లే మార్గంలేక ఇక్కడే నిల్వ ఉన్నాయి. విద్యార్థులు మంచినీరు తాగేందుకు నాలుగు మంచి నీటి చేతి పంపులున్నాయి. వీటిలో ఒకటి మోకాళ్లలోతు మురుగునీటిలో ఉండగా మరొక్కటి పిచ్చిమొక్కల్లో ఉంది, మరో రెండు పంపులు నెలరోజులుగా నీళ్ళు రావటంలేదు దీంతో విద్యార్థులు శుచీశుభ్రం లేని బయట వాటర్ ప్యాకెట్లు కొనుక్కొని దాహార్తి తీర్చుకోవాల్సి వస్తుంది.

చొర'బడి'నారు..

గుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. జడ్పీ ఉన్నత పాఠశాల మరియు ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో సుమారు 700మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అంత మంది విద్యార్థులు చదువుకునే సరస్వతీ నిలయం నేడు మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి స్థావరంగా మారింది. రాత్రి సమయాల్లో తాగిపడేసిన బీరు సీసాలు ఉదయం దర్శనమిస్తున్నాయంటే పాఠశాలలో భద్రత ఏస్థాయిలో ఉందో అర్థం అవుతుంది. రాత్రి కాపలాదారుడు కేవలం పాఠశాల గేట్లకు తాళాలు వేసేందుకే పరిమితం అవుతున్నారే తప్పా పాఠశాలలో కాపలా ఉండటంలేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులు, అధికారులు స్పందించి పాఠశాలోని సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈఓ టి.నవీన్‌కుమార్‌ను వివరణ కోరగా.. పాఠశాలలో నీటి పంపులు పాడైన విషయం తెలియదని అదేవిధంగా పాఠశాల ఆవరణలో ఉన్న మురుగునీటిని సాధ్యమైనంత త్వరగా తొలగించే విదంగా హెచ్‌ఎంకు ఆదేశాలు ఇస్తామని తెలిపారు. పాఠశాలను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

రోగాలకు నిలయంగా..



పనిచేయవు : నెల రోజులుగా పని చేయని మంచినీటి చేతి పంపు

పాఠశాలలో పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం స్కావెంజర్లను నియమించింది. వీరు ఉదయం నుంచి పాఠశాల పూర్తయ్యేవరకు మరుగుదొడ్లు శుభ్ర పరచటం, విద్యార్థుల తరగతి గదులు శుభ్రం చేయటం పాఠశాల ఆవరణ అంతా ఊడ్చి శుభ్రంగా ఉంచడం లాంటి పనులు చేయాలి. అయితే దీనికి భిన్నంగా పాఠశాల ఆవరణలో, తరగతి గదుల వెనుక వంట శాలకు ఇరువైపుల చెత్త నిండుకుపోయి డంపింగ్ యార్డును తలపిస్తుంది. మరి ముఖ్యంగా విద్యార్థులు భోజనం చేసిన తరువాత మంచినీటి సింకుల వద్ద ఎంగిలి ప్లేట్లు, అన్నం మెతుకులు నిల్వ ఉండటంతో ఈగలు ముసురి అంటు రోగాలకు నిలయంగా దర్శనమిస్తున్నాయి.



పనిచేసినా అందవు: మురుగు నీటిలో మంచినీటి చేతి పంపు

రిమాండ్ ఖైదీలకు న్యాయవిజ్ఞాన సదస్సు

రేపల్లె రూరల్: పట్టణంలోని సబ్‌జైలులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రిమాండ్ ఖైదీలకు మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు రిమాండ్ ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించి సమాజంలో తమ నడవడిక ఏ విధంగా మలుచుకోవాలో వివరించారు. న్యాయవాదులు కొండపల్లి శ్రీనివాసరావు, సబ్ జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రత్నశ్రీ సేవలు ఆదర్శనీయం

పెదగొల్లపాలెం(కర్లపాలెం): విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దటంలో ప్రధానోపాధ్యాయిని రత్నశ్రీ చేసిన సేవలు ఆదర్శవంతమైనవని కర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వేణుమాధవ్, ఎంపీ రాజుపాలెం హెచ్ఎం విజయభాస్కర్‌రెడ్డి, చింతాయపాలెం హెచ్ఎం వెంకటరాజు తెలిపారు. పెదగొల్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పనిచేసిన కె.రత్నశ్రీ మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు రత్నశ్రీని పూలమాలలతో సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులు పిట్టు మల్లికార్జునరెడ్డి, నాగరాజు, సంతోష్‌కుమార్, దత్తు, మాధవి, ఆదాంబీ, సుజాత, నాగమల్లేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

5న విజయవాడలో హైందవ శంఖారావం

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరుతూ నవంబర్ 5వ తేదీన విజయవాడలో హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించ తలపెట్టినట్లు ఎస్ఎస్ఎఫ్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి హిందువులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆలయాల రక్షణకై చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

యాజిలిలో ఉచిత పశువైద్య శిబిరం

యాజలి(కర్లపాలెం): గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసే పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో యాజలి గ్రామంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు రేచల్ దివ్య, మహేష్, తిరుమల తేజ పాల్గొని మొత్తం 650 పశువులకు పలు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండే పశువులు మాత్రమే అధికంగా పాలు ఇవ్వగలుగుతాయని చెప్పారు. జేడీ వేణుగోపాల్ మాట్లాడుతూ పశువులకు పోషక విలువలు కలిగిన దాణా పెట్టటం వలన పాల దిగుబడి పెరుగుతుందని చెప్పారు. పశువులలో సక్రమించే వ్యాధులకు సకాలంలో వైద్య సేవలందించాలని ఆయన చెప్పారు. అనంతరం పశువుల రైతులకు ప్రముఖ పారిశ్రామికవేత్త గుండ్రెడ్డి సత్యనారాయణ జామ మొక్కలు పంపిణీ చేశారు. పశు సంవర్ధక శాఖ ఏడీ శంకర్‌రావు, సత్యసాయి సేవా సంస్థల జిల్లా కో–ఆర్డినేటర్ గోవర్ధనరావు, గ్రామ ఉప సర్పంచ్ ఇక్కుర్తి శ్రీనివాసరావు, సత్యసాయి సేవా సంస్థల కో–ఆర్డినేటర్లు, టి.శ్రీనివాసరావు, కామేశ్వరరావు, గుండ్రెడ్డి సత్యనారాయణ, లక్ష్మణరావు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభించిన సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు రాంబాబు, జేడీ వేణుగోపాల్

మద్యం వ్యాపారులు నిబంధనలు పాటించాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్

రేపల్లె రూరల్: మద్యం దుకాణాల యజమానులు నిబంధనలు విధిగా పాటించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం మద్యం దుకాణాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం సీసాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలన్నారు. ఎమ్మార్పీ కన్నా అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒక వ్యక్తికి గరిష్టంగా మూడు సీసాలు మాత్రమే విక్రయించాలని చెప్పారు. మద్యం దుకాణాల నుంచి బెల్టుషాపులకు మద్యం సరఫరా చేయరాదన్నారు. మద్యం దుకాణాల నిర్వహణపై నిరంతరం తమ నిఘా ఉంటుందని, అధిక ధరలకు మద్యం విక్రయించినా, బెల్టుషాపులకు మద్యం సరఫరా చేసినట్లు తెలిసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి దుకాణంలో విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.



మద్యం దుకాణదారులకు సూచనలిస్తున్న ఎక్సైజ్ సీఐ దివాకర్

ఉపాధిహామీ పథకంపై అవగాహన సదస్సు

వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నాణ్యతతో కూడిన సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడతామని పంచాయతీ రాజ్ క్వాలిటీ కంట్రోల్ అసిస్టెంట్ ఎగ్జక్యూటివ్ ఇంజినీరు రజనీ కాంత్ అన్నారు. వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో వేమూరు, అమర్తలూరు, చుండూరు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థలో సిమెంట్ రోడ్ల నిర్మాణంలో పలు మార్పులు తీసుకొని రావడం జరిగిందని ఆయన తెలిపారు. సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసేలోపు మూడు సార్లు క్వాలిటీ కంట్రోలు తనిఖీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. వేమూరు మండలంలోని పెరవలి పాలెం గ్రామంలో వేస్తున్న సిమెంట్ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఏఈ రవీంద్ర, పంచాయతీ రాజ్ ఏఈ బద్రినారాయణ పాల్గొన్నారు.



పెరవలి పాలెంలో సీసీ రోడ్డు పరిశీలించిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు

రీ సర్వేతో రైతుల భూమికి హామీ

గొరిగపూడి(భట్టిప్రోలు): రైతుల స్వాధీనంలో ఉన్న భూమికి రీ సర్వే హామీగా ఉంటుందని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు అన్నారు. భట్టిప్రోలు మండలం కోనేటిపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభకు ఆయన అధ్యక్షత వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతుల దస్తావేజులోను, వారి స్వాధీనంలో ఉన్న భూమి మరొకరికి రికార్డయితే రీ సర్వేలో మార్పుచేసి సమస్య పరిష్కరించనున్నట్లు చెప్పారు. భూములకు సంబంధించిన యదార్థ పరిస్థితులపై ప్రతి రైతు సహకరించాల్సి ఉంటుందన్నారు. అవసరమైన సమయంలో నోటీసులు ఇచ్చి రైతులకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. గ్రామ సభలో 17 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. మండల సర్వేయర్ బి. శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్వేలు పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఫెన్సింగ్‌లో చింతాయ పాలెం విద్యార్థులకు పతకాలు

చింతాయపాలెం(కర్లపాలెం): రాష్ట్రస్థాయిలో జరిగిన ఫెన్సింగ్ పోటీలలో బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. పాఠశాల హెచ్‌ఎం టి.వెంకటరాజు, పీడీ ఎం.గోపి తెలిపిన వివరాల మేరకు ఇటీవల నంద్యాలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలలో అండర్–14 బాలుర విభాగంలో వి.విజయసాయి భాస్కర్, జి.అభిషేయిలు రజిత పతకాలు సాధించారు. అలాగే ఎ.కార్తీక్ నాయుడు, జె.రతీష్‌లు కాంస్య పతకాలు సాధించారు. అండర్–14 బాలికల విభాగంలో జి.సోఫియా రజిత పతకం, వై.సలోమి, టి.అమృత కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. ఫెన్సింగ్ క్రీడాకారులకు పాఠశాల ఆవరణలో అభినందన సభ నిర్వహించారు.

ద్విచక్రవాహనానికి నిప్పు

దాచేపల్లి: ద్విచక్రవాహనానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టి దగ్ధం చేసిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సౌందర్యరాజన్ మంగళవారం తెలిపారు. మండలంలోని మాదినపాడుకి చెందిన షేక్ సైదావలికి చెందిన ద్విచక్రవాహనం ఇంటి ప్రాంగణంలో పార్కింగ్ చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించటంతో కొంతభాగం దగ్ధమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలి

తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మిపతి సూచించారు. పట్టణంలోని 4వ శానిటరీ డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అటెండెన్స్ పరిశీలించారు. అనతంరం పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణపై పలు విమర్శలు వినిపిస్తున్నాయని, అలాంటివి రాకూండా చూసుకోవాలని తెలిపారు. ప్రతిరోజు చెత్త సేకరణను చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు సచివాలయం, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరు ఓటు పొందాలి

బాపట్లటౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును పొందాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి తెలిపారు. పార్టీ బాపట్ల కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని పట్టభద్రులు తప్పనిసరిగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. నవంబర్ 6వ తేదీలోపు ఓటు హక్కును పొందాలన్నారు. ఓటు హక్కు పొందని అభ్యర్థులు పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో దరఖాస్తు పూర్తిచేసి ఓటు పొందాలన్నారు. ఓటు నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జోగిరాజా, శాయిల మురళి, అడే చందు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోకి రాఘవరెడ్డి

పంటలను నిరంతరం పర్యవేక్షించాలి

రేపల్లె రూరల్: పంటలను నిరంతరం పర్యవేక్షించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్.విజయ్‌బాబు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కైతేపల్లి, పోటుమెరక గ్రామాలో మంగళవారం రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. తక్కువ పెట్టుబడులు అయ్యేలా సాగు చేయాలన్నారు. ప్రస్తుతం సాగులో తెగుళ్ల ఆశించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందని, వీటిని నివారించేందుకు వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలని చెప్పారు. ఎలుకలు వరిదుబ్బలను కొరికి నాశనం చేస్తాయని, ఈనె దశలో ఉన్న వరి కంకులను నాశనం చేస్తాయన్నారు. వీటిని నివారించేందుకు బుట్టలు పెట్టటంగాని, గుడ్లగూబలను సాగుభూమిలో వచ్చే విధంగా చేయటంగాని చేయాలన్నారు. ఎలుకల నివారణ మందును వినియోగించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏలు కె.అజయ్ గోపి, వి.లక్ష్మణ్‌సాయి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

అమర్తలూరు(వేమూరు): వరి పైరు గింజ పాలు పోసుకునే దశలో ఉందని మండల వ్యవసాయాధికారి ఉయ్యూరి లోకేశ్వరి అన్నారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి, యడవూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏట వరి పైరులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



వరిక్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఏఓ విజయ్‌బాబు, తదితరులు

చదలవాడలో..

వేమూరు: వరి పంటలో అధిక ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల పంట దిగుబడులు తగ్గుతాయని మండల వ్యవసాయాధికారి చందోలు సునీత తెలిపారు. వేమూరు మండలం చదలవాడ గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే లాభాలు గురించి ఆమె రైతులకు వివరించారు. రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల అభ్యున్నతే రోటరీక్లబ్ ధ్యేయం

రోటరీ ఆధ్వర్యంలో బాలికలకు సైకిళ్ల పంపిణీ

బాపట్లటౌన్: బాలికల అభ్యున్నతే రోటరీక్లబ్ ధ్యేయమని రోటరీక్లబ్ అధ్యక్షుడు కోశ్లపూడి ఉపేంద్రగుప్తా తెలిపారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఐదుగురు నిరుపేద విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఉపేంద్రగుప్తా మాట్లాడుతూ పట్టణంలోని అద్దంకి మంజూష, కాటూరి సౌజన్య, గవిని జ్యోత్స్న, భోగిరెడ్డి సుమశ్రీ, ఎనుముల అలేఖ్యలకు సైకిళ్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. రోటరీక్లబ్ కార్యదర్శి వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థినిలకు ఉచిత సైకిళ్ల పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రోటరీ సంస్థకు సహకరించిన విల్సన్ ప్రాజెక్ట్‌కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జిట్టా శ్రీనివాసరావు, సీనియర్ రోటరీ సభ్యులు బూర్లె రామ సుబ్బారావు, తోట కృష్ణ పాల్గొన్నారు.



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు

అనుమతిలేని భవనాలకు అపరాధ రుసుం

తెనాలిఅర్బన్: పట్టణంలో మున్సిపల్ అనుమతి లేకుండా నిర్మించిన భవనాలకు అపరాధ రుసుము విధించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలో అనుమతిలేని భవనాలను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేని భవనాలపై తమకు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. గృహ యజమానులు ఎవరు అనుమతులు లేకుండా భవనాలు నిర్మించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్వో రాంప్రసాద్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.